క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి



పాన్‌గల్: వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ఆయా కార్యక్రమాలను వారికి వివరించాలన్నారు. వడదెబ్బ నివారణ, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, గర్భిణుల నమోదు, రక్తహీనత నివారణ, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, టీబీ నివారణ తదితర అంశాలపై సిబ్బందికి తగు సూచనలు చేసి అవగాహన కల్పించారు. విధులపై అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీపనగండ్ల వాసికి డాక్టరేట్



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన జెట్టి జ్యోతికి 'తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో కాలానుగుణంగా వలసలు' అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ విభాగం నుంచి డాక్టరేట్ పట్టాను అందజేశారు. జెట్టి పార్వతమ్మ, హనుమంతు కుమార్తె జ్యోతి పేదరికంలో పుట్టి పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసించిన ఈమె డాక్టరేట్ పట్టా అందుకోవడం ఎంతో అభినందించాల్సిన అంశం అని గ్రామంలోని పలువురు కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ పట్టాను అందించారు.

మహనీయులకు ఘన నివాళి



పెబ్బేరు రూరల్: భారత స్వాతంత్ర్య సమర యోధులు మంగళ్‌పాండే, బంకింగ్ చంద్ర, శంకరంబాడీ వర్ధంతిని టీజేఎస్ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రజావాగ్గేయకారుడు రాజరాంప్రకాష్, భూరోజు గిరిరాజాచారి, నరసింహ్మ, దేవన్న నాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని శేరిపల్లికి చెందిన ఉప్పరి నారమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. పెబ్బేరు పట్టణ కేంద్రంలోని 12వ వార్డుకు చెందిన నేశ బాలస్వామి అకస్మాతుగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి స్పందించి రూ.10 వేల ఆర్థిక సాయం స్థానిక నాయకులకు పంపించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మృతదేహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున అందజేశారు. బీరం రాజశేఖర్‌రెడ్డి, వెంకట రమణ, కురుమన్న, బాలన్న, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ



పెబ్బేరు రూరల్: ఉగాది పండుగ సందర్భంగా సోమవారం మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు స్వయంగా తయారు చేసిన ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులందరికీ ఉగాది పచ్చడిని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంప్రసాద్, ఎంఎస్ విజయకుమార్, భాస్కర్, మల్లికార్జున్, ఇందిర, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీటితొట్లు నిరుపయోగం



కొత్త సూగూరులో శిథిలావస్థలో నీటితొట్టి

- తాగునీటికి అల్లాడుతున్న మూగజీవాలు
- నిర్వహణ గాలికి వదిలేసిన అధికారులు
- వినియోగంలోకి తీసుకురావాలంటున్న పశుపోషకులు



జనుపల్లిలో నీరులేక నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

పెబ్బేరు రూరల్: వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు రూ.లక్షలు ఖర్చుపెట్టి గ్రామాల్లో నీటితొట్లను నిర్మించారు. వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. ఒక్కొక్క గ్రామంలో 2 నుంచి 3 వరకు నీటితొట్లు నిర్మించారు. వాటిలో నీటి సరఫరా లేకపోవడంతో తొట్లు నిరుపయోగంగా మారాయి. మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. మండలంలో దాదాపు 20 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో పశువులకు తాగునీరు అందించేందుకు మండలంలో వివిధ గ్రామాల్లో దాదాపు 30 వరకు నీటితొట్లు నిర్మించారు. ఇప్పటి వరకు వాటిని వినియోగించలేదు. దీంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నీటితొట్లకు నీటివసతి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంతో నీటి వినియోగానికి నోచుకోలేకపోతున్నాయి. 30 నీటితొట్లలో కనీసం 20 వరకు వినియోగంలో లేవు. గ్రామాల్లో చాలావరకు నీటితొట్లను నిర్మించినా.. వాడకపోవడంతో అవి బీటలు వారుతున్నాయి. ప్రభుత్వం ఒక్కొక్క నీటితొట్టికి సుమారు రూ.25 వేల వరకు వెచ్చించింది. రూ.లక్షల్లో ప్రజాధనం వెచ్చించినా.. మూగజీవాల దాహం తీర్చలేకపోతున్నాయి. ప్రభుత్వం మంచి లక్ష్యంతో నీటి తొట్లను నిర్మించింది. మండలంలో 3,425 పశువులు ఉన్నాయి. బయటకు మేతకు వెళ్లి తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్న మరమ్మతులు చేస్తే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వేసవిలో ఎండలు తీవ్రమవడంతో వాగులు చెరువులు, కాల్వలు భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోయాయి. దీంతో మూగజీవాలకు దాహం తీరడం కష్టంగా మారింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పశుపోషకులు కోరుతున్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చాలి..

గ్రామాల్లో రూ.వేలు ఖర్చు చేసి పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటితొట్లకు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నాయి. గొర్రెలకు నీరు తాపడానికి చాలా ఇబ్బందిగా మారింది. నీటి తొట్లను వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చి మూగజీవాలకు దాహార్తి తీర్చాలి.

– భగవంతు, రంగాపురం

నీటి సరఫరా అందించాలి..

ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా ఉండటంతో పశువులు, గొర్రెలకు నీరు అందుబాటులో లేకుండా పోయింది ఇకనైనా శిథిలావస్థలోని నీటి తొట్లకు మరమ్మతు చేసి నీటి సరఫరా అందించాలి.

– గొల్ల రాములు, సూగూరు

వినియోగంలోకి తీసుకొస్తాం..

కొన్ని చోట్ల నీటితొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల ఉపయోగంగా ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న నీటితోట్లకు మరమ్మతు చేయించి ఉపయోగంలోకి తీసుకొస్తాం.

– రవీంద్ర, ఎంపీడీఓ, పెబ్బేరు

వినియోగంలోకి నీటి తొట్టి

సాక్షి ఎఫెక్ట్..



కల్వరాలలో పశువులతొట్టిని నీటితో నింపిన అధికారులు

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన పశువుల తొట్లను నీటితో నింపాలని సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కల్వరాల్లలో ఖాళీగా ఉన్న పశువుల తొట్టిని పంచాయతీ కార్యదర్శి కుర్మన్న నీటితో నింపారు. మండలంలోని మిగతా గ్రామాల్లో అవసరమైన చోట నూతనంగా పశువుల తొట్లను నిర్మించి, గతంలో నిర్మించి వదిలేసిన వాటిని వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగానే గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కోసం ప్రైవేట్ బోర్లను లీజుకు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి ఎండలు ముదురుతుండటం, జలాశయాలు అడుగంటుతుండటంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయని, దీంతో గ్రామాల్లో ఇప్పటికే తాగునీటి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. సత్యసాయి తాగునీటి పథకానికి సంబంధించి ఎడమ కాల్వ ఇన్‌టెక్ వెల్ వద్ద నీరు చేరకుంటే జూరాల బ్యాక్‌వాటర్‌లో పంపులు వేసి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో జరిగే పనుల్లో వేగం పెంచాలని సూచించారు. జాబ్‌కార్డులు కలిగి పనులకు రాని వారిని గుర్తించి వారి జాబ్‌కార్డులను రద్దు చేయాలని ఆదేశించారు. నర్సరీల్లో 80 శాతం మొక్కలు బతికేల సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్‌లో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ నరసింహులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

చెరువు కాల్వలో మురుగు తొలగించాలని వినతి



మున్సిపల్ ఆర్ఐకి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని 3, 4, 8 వార్డుల పరిధిలోని చెరువు కాల్వలో మురుగు చేరడంతో దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయా కాలనీలకు చెందిన ప్రజలు మున్సిపల్ అధికారులకు సోమవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా పెద్ద చెరువుకు సంబంధించి అలుగు కాల్వ పట్టణంలోని ఆయా కాలనీల మీదుగా నీరు వెళ్లేందుకు నిర్మించారు. కొన్ని సంవత్సరాలుగా చెరువు కాల్వలో ఇళ్లలోని మురుగు కాల్వలు కలిపారని అన్నారు. మున్సిపల్ పాలకవర్గంతో పాటు అధికారులు స్పందించి చెరువు కాల్వను నూతనంగా అండర్ డ్రైయినేజీ నిర్మించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాజన్న, నాగప్ప, మహేందర్, కుమ్మరి బాలస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలి



పాన్‌గల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వర్



పాన్‌గల్ మండలం మాధరావుపల్లిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఏఎన్ఎం



అమరచింత ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

పాన్‌గల్: రోజు, రోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రత నుంచి కాపాడుకునేలా వేసవి జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రతలో ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఉదయం త్వరగా పనులకు వెళ్లేలా అవగాహన కల్పించడం, పనులు జరిగే ప్రాంతాల్లో నీడ, నీటి వసతి తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని జీపీల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్‌రెడ్డి వివరించారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే వడదెబ్బ కేసులు నమోదు కాకుండా ఉంటుందని తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలియజేశారు. సమావేశంలో ఏఓ సాజిద్‌రహమాన్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, డీటీ అశోక్‌నాయుడు, వైద్య, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాధరావుపల్లిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లిలో ఉపాధి కూలీలు, గ్రామస్తులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏఎన్ఎం సుమిత్ర సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తీవ్రమైన ఎండలతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని దీంతో ఉపాధి కూలీలు, ప్రజలు జాగ్రత్తలను పాటించాలన్నారు. సమావేశంలో ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ పంపిణీ

అమరచింత: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అంగన్‌వాడీ లబ్ధిదారులకు అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద తెలిపారు. పట్టణంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్ రాధిక చిన్నారులతో పాటు లబ్ధిదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న వేసవి తాపంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఉదయం పదకొండు తర్వాత బయటకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



పెబ్బేరు రూరల్: అమావాస్యను పురస్కరించుకుని వనపర్తి మండలంలోని పెద్దగుడెం శివారులోని తిరుమలయ్య గుట్ట అడివి ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయంలో అభిషేకాలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. దాతల సహకారంతో ఆలయం వద్ద అన్నదానం చేశారు. పాతపల్లి చింతలకుంట ఆంజనేయస్వామి వద్ద అమావాస్య పూజలు నిర్వహించారు.

వీరభద్రస్వామి ఆలయంలో అన్నదానం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం వద్ద సోమవారం అన్నదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న దేవాలయంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదానం చేశారు.

భగవద్గీత గ్రంథాలు పంపిణీ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని నాయీ బ్రాహ్మణ వీధిలోని నర్సింహస్వామి దేవాలయం వద్ద సోమవారం భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని కొంత మందికి ఈ గ్రంథాలను నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు విక్రం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు ఈ భగవద్గీత ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శేఖర్, ఆశన్న, శేషయ్య, శ్రీను, రాజేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించండి



ధర్మపురంలో కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మపురంలో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజువారి కూలీ డబ్బులు రాక తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఎలా జరుపుకోవాలో అర్థం కావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేయాలన్నారు. పనుల వద్ద నీడ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు శంకర్, కురుమూర్తి, దాసరి ఆశన్న, జములన్న, సత్యమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఐరిష్ విధానం ప్రవేశపెట్టాలి



కలెక్టర్ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

పెబ్బేరు రూరల్: భవన నిర్మాణ రంగానికి ఐరిష్ విధానాన్ని తక్షణమే ప్రవేశపెట్టాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం మదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న అనేక మంది కార్మికులకు వెల్ఫేర్ బోర్డు కార్డులు నమోదు, కొత్తగా రెన్యూవల్ చేసుకునే సమయంలో మీ సేవల ద్వారా సాంకేతిక లోపాలు ఉన్నాయని, కార్మికుల వేలిముద్రలు పడక కార్డును కోల్పోతున్నారన్నారు. ప్రసూతి వివాహ కానుకలకు రూ.30 వేల నుంచి రూ.లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు పుల్లయ్య, హనుమంతు, బాలపీరు, రవి, మన్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

నాణ్యతగా నిర్మించాలి

పెద్దకొత్తపల్లి: సీసీ రోడ్లను నాణ్యతగా నిర్మించాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మరికల్‌లో సీసీ రోడ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జాతీయ ఉపాదిహామీ పథకం ద్వార మరికల్ గ్రామానికి రూ.33 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మాజీ సర్పంచ్‌లు సత్యం, చిన్నయ్య, అబీబ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

మదనాపురం: మండల కేంద్రంలోని మసీదులో సోమవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు ముస్లింలు నమాజ్ ముగించుకొని ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. అనంతరం కమిటీ పెద్దలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా పూలమాల శాలువాతో సన్మానించారు.

పట్టణంలో చిల్లర దొంగల హల్‌చల్

- బైక్‌లు, మూసి ఉన్న షాపులే లక్ష్యం
- నిద్రావస్థలో నిఘా నేత్రాలు



చండూల్ బీడీఫ్యాక్టరీ వద్ద దాచిన బైక్ (ఫైల్)



కేజీఎన్ మిల్క్ సెంటర్ షట్టర్‌ను పగలగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

అమరచింత: పట్టణంలో రోజురోజుకు చిల్లర దొంగల బెడద తీవ్రమవుతున్నా వీటిని అరికట్టేందుకు పోలీసు శాఖ చేపట్టడం లేదు. మూడు రోజుల కిందట రాణాప్రతాప్‌నగర్‌లో ఇళ్ల వద్ద నిలిపిన బైక్‌లను ఎత్తుకెళ్లేందుకు యత్నించిన గుర్తుతెలియని వ్యక్తులు వాటిని చండూల్ ఫ్యాక్టరీ ఆవరణంలో తీసుకొచ్చి దాచిపెట్టారు. బైక్‌లకు చెందిన వైర్లు, ప్లగ్‌లు పానర్‌లను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా ఆదివారం మధ్యరాత్రి బస్టాండ్ రహదారి బీజేపీ జెండాకట్ట సమీపంలో మూసి ఉన్న కేజీఎన్ మిల్క్ పాయింట్ షట్టర్‌ను తెరిచి రూ.60 వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితుడు ఖాజా తెలిపారు. ఈ పక్షం రోజుల నుంచి పట్టణంలో చిల్లర దొంగతనాలు జోరందుకున్నాయని పోలీసుల గస్తీ లేకపోవడంతో ఇలాంటివి జరుగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. రాత్రి వేళలో ఆయా వార్డులతో పాటు ప్రధాన రహదారుల వెంట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

మొక్కలకు రక్షణ కరువు



రాయినిపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన కాలిపోయిన మొక్కలు(ఫైల్)

పాన్‌గల్: మండలంలో ఇటీవల తరచూ ఎక్కడో ఒకచోట రోడ్డుపక్కన ఉన్న హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి అవుతూనే ఉన్నాయి. ఇటీవల బండపల్లి స్టేజీ, రాయినిపల్లి గ్రామ సమీపంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. పొలాల వద్ద ఎండిన పనికిరాని మొక్కలు, గడ్డికి నిప్పుపెడుతుండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. గతంలో ఏ రైతు పొలం సమీపంలోనైనా ఇలా మొక్కలు, చెట్లు కాలిపోయినా, దెబ్బతిన్నా ఆ రైతు నుంచి ఆయా గ్రామపంచాయతీలు అపరాధ రుసుం వసూలు చేసేవారు. దాంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదు. గ్రామాల్లో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో వీటిపై శ్రద్ధ తగ్గింది. దీంతో ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు పొలాల పక్కన ఇలా నిప్పు పెట్టి చెట్లకు నష్టం కలిగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పిస్తూ.. ఏళ్లతరబడి పెంచిన హరితహారం చెట్లు, మొక్కలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాల తనిఖీ

లింగాల: మండలంలోని రాంపూర్ స్టేజీ దగ్గర సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అనుమతి లేకుండా వాహనాలలో రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ వెంకటయ్య, కిషన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.